
కథ

# ఆణిముత్యాలు

వేదుల చిన్నవేంకట చయనులు

''ఇదిగో వస్తున్నా. జావ ఐపోవచ్చింది'' గట్టిగా కేక వేసింది వర్ధనమ్మ. వంటింటి పక్కనే మంచం మీద మూల్గుతూ, భర్త రంగయ్య అప్పటికి నాలుగు శాపనార్థాలు పెట్టేశాడు. జావకలుపుతూ వర్ధనమ్మ యథాప్రకారంగా స్మృతిపథంలోకి మరలింది. ఆ మిద్దె ఇంట్లో కాలు పెట్టి అరవై ఏళ్లు కావస్తోంది. ఎంత వైభవంగా ఉండేదో ఆ ఇల్లు. ఆ వాడ, ఆ పల్లె! బండి శ్రీరామపురం పొలిమేరలు చేరగానే పచ్చని పైరులు, చల్లని వాతావరణమూ చూసి అచ్చంగా శ్రీరాములవారే దానిని పోషిస్తున్నారా అని అనిపించింది నూతన వధువు వర్ధనమ్మకు. కాలచక్రంలో ఎంత మార్పు వచ్చింది?



''ఏమే ఎక్కడేడుస్తున్నావే!''అన్న రంగయ్య కేకతో వాస్తవానికి వచ్చింది వర్ధనమ్మ. టీ తాగుతున్న భర్తని చూస్తూ మళ్ళీ వర్ధనమ్మ గతంలోకి వెళ్లిపోయింది. ఇటీవల ఆయనకి జబ్బు చేసి మూడునెలలైంది. ఆయనకి క్యాన్సర్ అని డాక్టర్లు తేల్చేశారు. మంచినీళ్ళు తప్ప మరేదీ నోట్లోకి వెళ్లడం లేదని డాక్టరు గారు ఇంట్లోనే సెలైను, గ్లూకోజ్, మందులూ, గొట్టాల ద్వారా ఎక్కించే ఏర్పాటు చేశారు. అవి చూసి ఆఖరి రోజులు వచ్చాశాయని వర్ధనమ్మ గుండె ఝల్లుమంది. ఇంత వరకూ పిల్లలకి క్యాన్సరని చెప్పనే లేదు. వాళ్లకి చెప్పడం మంచిదని, ఆరునెలల క్రింద పెద్దవాడు ప్రసాదు అమెరికా నుంచి వచ్చినప్పుడు పెట్టించిన ఫోను దగ్గరకి వెళ్లింది.

''ఇది మా కోసమే. మేం మాట్లాడినప్పుడు మాకేగాని మీకేమీ ఖర్చు వుండదు. నెలనెలా మీకు వచ్చే బిల్లు మీరు మాట్లాడినదానికి, దాని సంరక్షణగా మీరు చేయవలసింది ఏమీ లేదు. కాదనకండి నాన్నగారూ''అని బ్రతిమాలి పెట్టించాడు. ఇంత వరకూ అటునుంచే గాని ఇటునుంచి ఒక్కసారి కూడా మాట్లాడలేదు. తను గాని, ఆయన గాని.

అమెరికా అంటే బోలెడు అవుతుందని చెప్పాడు గనుక. గౌహతిలో వున్న చిన్నవాడు విజయ్‌కి, '' ఒరేయ్! నువ్వే అన్నయ్యకి చెప్పురా'' అని చెప్తామని ఫోన్ తీసింది భయం భయంగానే. రక్షించి ఏ ఇబ్బంది లేకుండానే మొదటిసారి ఆ నెంబర్లు తిప్పగానే రింగయ్యింది.

''అల్లో..అల్లో....నేనురా విజయ్! నాన్న గారికి క్యానరంటున్నారురా....'' అని వర్ధనమ్మ మరి మాట్లాడలేక అలాగే

వుండిపోయింది. అటు పక్క నుంచి విజయ్ కూడా యేడుస్తూ, ''కంగారు పడకమ్మా! నీ శలవు తీసుకొని వస్తున్నానమ్మా'' అని అనగానే వర్ధనమ్మకి కొండంత బలం వచ్చినట్లయింది. అన్నయ్యకీ, చెల్లెళ్లకీ చెప్పమన్నాక తేలికగా ఫోన్ దింపింది. ఆరోజంతా ఫోన్ మోగుతూనే వుంది. మొదట ప్రసాదు, తరువాత సుందరి, ఆ పిమ్మట రత్తాలు. ఎంత దూరంగా వుంటే అంత చప్పున ఫోన్ చేద్దామా అనిపిస్తుంది కాబోలు అని వర్ధనమ్మ అనుకుంది. ప్రసాదు అమెరికాలో, సుందరి హైదరాబాదులో, రత్తాలు అందరికంటే దగ్గరగా విజయనగరంలో ఉండడం చేత.

'' ఏంటి? ఆ ఫోన్లు? నువ్వు నాకిక ఆఖరి రోజులని గాని కబురుచేశావేంటి? డాక్టరు కబురు చేసుకో అనేశాడా? హమ్మయ్య! సర్వేశ్వరా! తండ్రీ త్వరగా తీసుకుపో బాబూ'' అని రంగయ్య మూలిగాడు.

''మీరు మరీనూ డాక్టరలా యేమీ అనలేదు. ఆ గొట్టాలేవో పెడుతున్నారురా అని విజయ్‌కి ఫోన్ చేసాను. వాడు వాళ్లకి చెప్పి వుంటాడు. పిల్లలందరూ వరుసగా చేశారు. ఒక్కర్తినీ వుండి భయమేసి...'' అంటూ కన్నీటితో మరి మాట్లాడలేకపోయింది.

''ఎంతో శ్రమ పడుతున్నావ్ నా గురించి. అందరికీ శ్రమ దేనికి గాని వీలుంటే విజయ్‌ని రమ్మను'' అని చేతిలో చేయి కలిపాడురంగయ్య. చాలా కాలం తరువాత అంత ప్రేమ చూపించిన ఆయనని చూస్తూ ఒక చిరునవ్వుతో,

''ఏం? మిగతా వాళ్లని చూడాలని లేదేంటి?'' చిలిపిగా అడిగింది.

''ఉంటుందే. ఉండకెక్కడ పోతుంది? విజయ్‌కి రైలు ఖర్చులు లేవు కదా! చటుక్కున ఓ నాలుగురోజులకి కాజువల్ లీవ్ మీద రాగలడు. ఓ మాట చెప్పనా? నాకు వెళ్లిపోతున్నానని బెంగ లేదే. ఒక్కటే విచారం. మా నాన్న నాకు బోలెడు ఆస్తి ఇచ్చి వెళ్లాడు. అంతా ఖర్చు చేసి అందులో పదో వంతైనా నా తరువాత వాళ్లకి ఇవ్వడం లేదనే నా విచారం''

''భలే వారండీ! ఆయన మీలాపిల్లల చదువులకి వేలకి వేలు, అమ్మాయిల పెళ్లిళ్లకి లక్షలూ పెట్టారాయేం? అదలా వుంచి ఆస్తిపాస్తులు మాకేమీ అవసరం లేదు. అన్నీ అమ్మేసి ఓ చిన్న ఇంట్లో హాయిగా వుండండి అనే కదా వాళ్లు నూరిపోస్తున్నారు? మరి దేనికి ఆ విచారమంటా?''

''అవును... పిల్లలు ఆణిముత్యాలు...'' అని కళ్లు మూసుకొని వుండిపోయిన ఆయనని చూసి అప్పటికే చాలా మాట్లాడి అలసి పోయారని చల్లగా అక్కడి నుంచి కదిలి వర్ధనమ్మ వచ్చేయబోతుంటే, చేయి పట్టుకొని రంగయ్య మళ్లీ,

''ఈ గొట్టాలు పెట్టాక కొంత హాయిగా వుంది. అదేదో వెళ్తున్నంత సేపూ. పిల్లలే సంపద అంటారు. ఆ లెక్కన మనం కోటీశ్వరులమేనే. ప్రసాదు ఒక్క రోజైనా అల్లరి చేయలేదు. క్లాసులో ఎప్పుడూ ఫస్టు. అలాంటి వాడిని కూడా నా బెంగలో నేను కొట్టాను చాలా సార్లు. సినిమాలు, ఆటలూ అంటూ పాడైపోతున్నాడంటూ... కాస్సేపు గతం స్మరిస్తూ మళ్లీ ఒక చిరునవ్వుతో.

''మీరలా అబ్బాయిల గురించే వర్ణించేస్తున్నారు. మరి అమ్మాయిలు తీసిపోయారా ఏంటి?''

''అంతా నేనే చెప్పేస్తే నీకేమీ వుండదనీ....''



''అవును... పిల్లలు ఆణిముత్యాలు...'' అని కళ్లు మూసుకొని వుండిపోయిన ఆయనని చూసి అప్పటికే చాలా మాట్లాడి అలసి పోయారని చల్లగా అక్కడి నుంచి కదిలి వర్ధనమ్మ వచ్చేయబోతుంటే, చేయి పట్టుకున్నాడు. రంగయ్య.

అని ఒక చిరునవ్వు విసిరిన భర్తను చూసి పొంగిపోతూ వర్ధనమ్మ అతని గుండె నిమురుతూ తల వంచుకొని వుండిపోయింది. ఎంతకీ తలెత్తని ఆవిడతో రంగయ్య-

''పోనీలే మన మనసులలో వున్నది ఒకటిగా చేసి నేనే చెప్తాను. అబ్బాయిలు ముత్యాలైతే, అమ్మాయిలు రత్నాలు అనే అనాలి. పెద్దది మా అమ్మ పేరు పెట్టినందుకు సాక్షాత్తూ అమ్మే మళ్లీ మన ఇంటికి వచ్చిన రత్నం. ఎంత సహనమో! అదే మన చిన్నదైతే ఆ రాకాసి అత్తగారికి ఎప్పుడో బుద్ధి చెప్పి వుండి ఇంటి పెత్తనం చక్కబెట్టేది''

రంగయ్య అవీ ఇవీ మాట్లాడి అలసిపోయి కనులు మూసుకున్నాడు.

***

'నాన్నారూ' అని సుందరి పిలవగానే కనులు తెరిచి, 'వచ్చావా, తల్లీ! పిల్లలంతా కులాసానా? వచ్చేరేంటి నీతోటి?' అని సంతోషంగా రంగయ్య పలకరించాడు. పరీక్షలు వాళ్లకి, అవి అవగానే వస్తారని చెప్పి, అమ్మను చూడడానికి సుందరి వంటింట్లోకి వెళ్లింది. అమ్మతో క్యాన్సర్ స్పెషలిస్ట్ సంగతి ఎత్తింది. డాక్టరు గారన్నది, నాన్నగారి అభిమతమూ అమ్మ స్పష్టంగా చెప్పినా, తన మాట కాదనరనీ నిబ్బరంతో సుందరి వెళ్లి-

''నాన్నారూ, క్యాన్సర్ స్పెషలిస్ట్‌కి చూపించుదామని వుంది......''

ఇంకా సుందరి మాట పూర్తి కాకుండానే, రంగయ్య ఆవేశంతో..

'' ఎన్నిసార్లు, చెప్పాలే మీ అమ్మకి. నా వల్ల కాదు మొర్రో అని. నిన్ను పంపించిందా? నేనిక్కడ నుంచి కదిలేది ఆ పైలోకానికి. నా కన్నతల్లివి కనుక వాళ్లకి నా ఇష్టం చెప్పి నన్నిక్కడే ఇలా చావనీ అమ్మా'' అని చేయి పట్టుకొని రంగయ్య వేడుకుంటుంటే సుందరికి చెప్పలేని దుఃఖమొచ్చింది. సుందరి వచ్చాక వర్ధనమ్మకి చాకిరీ ఆరాటం తగ్గింది. కాని అబ్బాయిలు వెంటనే రావడంలేదనే భయం ఆరంభమయింది. తీరా ఆ ప్రాణం పోయే సమయంలో ఇద్దరిలో ఒక్కడైనా వచ్చి అంత్యక్రియలు చేస్తాడా? లేదా? అని...వర్ధనమ్మ భయానికి తగినట్లే ఆ సాయంత్రమే డాక్టరు చెప్పేశాడు. పరిస్థితి రోజులలోకి దిగజారిపోయిందని.

సుందరి మొదట ప్రసాదుకి ఫోన్ చేసింది. కమల ఫోను తీసి ''ఆయనకు నిన్నటి నుంచి జ్వరంగా ఉంది. డాక్టరుగారినడిగి బయలుదేరతారు. ఇదుగో ఆయనతోనే మాట్లాడు'' అని ప్రసాదుకి ఫోన్ అందించింది.

''వీలయినంత త్వరగా బయలుదేరుతానే, అమ్మకు ధైర్యం చెప్పు'' అని ప్రసాదు పెట్టేశాడు.

విజయ్‌తో మాట్లాడుదామంటే సాధ్యమవలేదు. సమయానికి మగపిల్లలు వస్తారో లేదో అని అనుమానమే అన్నది విన్నాక. రత్తాలుకి ఫోను ఇచ్చింది. అందరికీ ఫోనులు, టెలిగ్రాములు అయ్యాక, సుందరి అమ్మతో తను చేసిన పనులన్నీ చెప్పి...

'' ఔను గానీ, బాబుల్లారా తలో నెల్లాళ్లు సెలవు పెట్టుకొని వచ్చి నాన్న దగ్గర వుండండర్రా అని ఖచ్చితంగా మగపిల్లలకి చెప్పుకోరూ?'' అని తల్లికి ఒక చురక అంటించింది.

''నాకు నీ అంతటి తెలివితేటలు లేవే'' అని చెప్పి

వర్ధనమ్మ రాగంతో కొంగు పట్టుకుంది.

కళ్ల నిండా నీళ్లు నింపుకొని రత్తాలు మాత్రమే బయలుదేరింది.

* * *

రంగయ్య ప్రాణం పోయిన వేళకి ప్రసాదు నుంచి విజయ్ నుంచి గాని బయలుదేరుతున్నామన్న కబురే లేదు. ముకుందమే ఆనాటి తంతు జరిపి దహనక్రియ చేశాడు. ఆ మరునాడు శంకరం, గంగాయమ్మా పరామర్శకు దిగారు. విజయ్, ప్రసాద్‌లు ఫోను చేశారు, బయలుదేరుతున్నామని రాజమండ్రిలో గోదావరి తీరాన మిగిలిన కర్మకాండ జరుపుకుందామనీ చెప్పారు. నాలుగో రోజుకి విజయ్, ఆ మరునాటికి ప్రసాదు శ్రీరాంపురం చేరుకున్నాక ఎనిమిదోరోజు నుంచి రాజమండ్రిలో, గోదావరి తీరాన్ని రంగయ్య గారి అంత్యక్రియలు పూర్తయ్యాయి.

పిల్లలందరూ గెస్ట్‌హౌస్‌లోని పెద్ద డ్రాయింగ్ రూమ్ సోఫాలలో విశ్రాంతి తీసుకుంటున్నారు. నీరసమంటూ వర్ధనమ్మ ఆ పక్క పడక గదిలో నేల పైన చాప పరుచుకుని నడుము వాల్చింది. లీలగా రంగయ్య ఎదురుగా కనపడి ''నీకెందుకింకా దిగులు? ఆణిముత్యాల్లాంటి పిల్లలు నా అంత్యక్రియలన్నీ సవ్యంగా జరిపించారు గదా'' అని అంటున్నాడు. అదే సమయంలో సన్నగా పక్క రూమ్ నుంచి పిల్లల మాటలు అలా అలా వినిపిస్తున్నాయి.

''అమ్మ మా దగ్గర వుంటే మాకూ, అమ్మకి కూడా ఎంతో సుఖం. ఒక్కటే చిక్కు. ఆ దేశంలో వంటికి ఏది వచ్చినా, హెల్త్ ఇన్స్యూరెన్స్ లేకపోతే చచ్చినంత ఖర్చు. ముందు మనకున్నదంతా అయిందనిపించి దివాళా తీసామన్నాకనే ఉచితంగా ట్రీట్‌మెంట్ జరిపిస్తారు. అమ్మకి మా ఇన్స్యూరెన్స్ పనికిరాదు. తనకి సిటిజన్‌షిప్ వచ్చాకనే ప్రభుత్వ హెల్త్‌పాలసీ వస్తుంది. అది రావడానికి ముందు గ్రీన్ కార్డ్ రావాలి. అది వచ్చిన ఐదేళ్ల తరువాత అప్లయ్ చేస్తే ఆ మీద మరో ఏడాది నాటికది తేలుతుంది. ఇప్పటి దాకా అమ్మకేమీ లేదు గానీ వయసు మీరింది కదా! నాన్నకి మొన్న మొన్నటిదాకా ఏమీ లేదు. చూడండి. ఎలా వచ్చిపడిందో ఒక్కసారి. అదలా వుండగా ఖర్చు మాటటుంచి అమ్మే విమానంలో అంత సేపు ప్రయాణం చేయాలి. ఒక వేళ ఎప్పుడన్నా అమ్మను చూడాలనిపిస్తే మీరే రావాలి అక్కడికి''

''మేమెలా రాగలంరా అంత ఖర్చు పెట్టుకుని?'' అంది రత్తాలు.

''అమ్మని చూడడానికి ఖర్చు పెట్టుకొని వాడూ రావాలి కదా? అదే మనకి పెద్దాడే. ఒక ఏడాది నీకు, మరో ఏడాది నాకూ'' అంది సుందరి.

''మీ ఆయన రెండు చేతులా ఆర్జిస్తున్నాడు కదే, నీకెందుకు పెట్టాలే?'' అని విజయ్ అంటించాడు.

''నిన్నెవరు అడిగారురా? మీ ఇంటికి రావడానికి నిన్ను ఇవ్వమననులే'' అంది సుందరి.

'బాగుందర్రా... మీ దెబ్బలాట' అని వర్ధనమ్మ మనసులో అనుకొని మరింత కుతూహలంతో వారి మాటలను వినసాగింది.

ప్రసాదు మళ్లీ తన బాధ చెప్పుకుపోతున్నాడు.

''మేమిద్దరం రోజంతా ఆఫీసులో వుంటాం. పిల్లలు ఇంకా హైస్కూలే కనుక పొద్దున్నుంచి మధ్యాహ్నం నాలుగింటి వరకూ హైస్కూలులో ఆ తరువాత వాళ్ల సోది వాళ్లది. తెలుగు అర్థమైనా మాట్లాడలేరు. అమ్మకి ఇంగ్లీషురాదు. రోజంతా ఒక్కత్తీ బోరు ఫీలవుతుంది. అమ్మలాంటి వారు అందుకే ఆ దేశాన్ని బంగారు పంజరమంటారు. పోనీ మన దేశం వచ్చేద్దామంటే సొమ్ము మాటటుంచి, పని వాతావరణం వేరు. అక్కడ అలవాటయ్యాక మన దేశంలో చాకిరీ చెయ్యలేము. మాకే అనుకుంటే పిల్లలకి ఇంకా కష్టం.''

''అయితే ఏమంటావ్? ఇంత తిప్పి తిప్పి చెప్పేకన్నా, ఒక్కమాటలో చెప్పెయ్యరాదూ నే తీసుకెళ్లలేనని!'' అని కొంచెం గట్టిగానే సుందరి మాట.

''నెమ్మదిగా మాట్లాడవే! అమ్మ పడుకుంది పక్క గదిలో మరిచిపోయావా?'' అని విజయ్ గొంతుక.

కొంచెం నిశ్శబ్దం. ఆ తరువాతే మళ్లీ మెల్లగా సుందరి మాట వినవచ్చింది.

''నువ్వంటే ఆ దేశంలో ఏడ్వాలి గానీ, అమ్మకి అక్కడే ఉండాలని ఏముంది? ఉన్నాడుగా ఇంకో కొడుకిక్కడ?''

''సుందరీ నీ మాట దురుసుతనం పోనిచ్చుకున్నావు కావు. ఆ గీరంతా మీ ఆయన ఈ దేశంలోనే గొప్పగా ఆర్జిస్తున్నాడనేగా?'' అని కొంచెం నిష్ఠురంగానే ప్రసాదు మాట్లాడాడు.

''అదేం కాదు. ఉన్నదంటే ఉలుకెందుకూ? అయినా విజయ్, నువ్వు ముద్దరాలులా ఉలుకూ పలుకూ లేకుండా కూర్చున్నావేం?''

''సుందరీ, నీకు తెలియనిదేముంది? కాంతం ఒక్క అమ్మ విషయంలో తప్ప చాలా మంచి మనిషి అనే చెప్పాలి. అప్పుడెప్పుడే అమ్మ అలా అంది. అమ్మ నా డిపెండెంట్ అని చెప్పి అలాగే మన దేశంలో అమ్మ ఎక్కడికి వెళ్లాలన్నా ఫస్ట్‌క్లాస్ పాసులు పంపగలను'' అని అన్నాడు విజయ్.

''అమ్మకి నా బొందిలో ప్రాణం వున్నన్నాళ్లు సేవ చేసి అమ్మ ఋణం తీర్చుకోవాలనే వుంది. కానీ మా అత్తగారు ఉన్నన్నాళ్ళు అది సాధ్యమయ్యే మాట కాదు. మా అత్తగారు మనల్నందర్నీ పంపించి ఆ లోకానికి వెళ్లేటట్టు వున్నారు'' అని రత్తాలు ఒక చిన్న రాగం తీసింది.

''అన్నయ్యలూ మీరిద్దరూ అమ్మని మా ఇంట దింపినప్పుడు బావగారూ మీరే కాపాడగలరు. మా సుందరి, మీరూ, అమ్మని చూసుకొని కాపాడండి. అమ్మ విషయంలో మీకు దమ్మిడీ ఖర్చు వుండదు. అమ్మ పేరన వున్న ఇల్లు, భూములు, మీకే! మాకు వాటితో సంపర్కం లేదు. అని చెప్పండి...''

''ఏంటి? అలా చూస్తున్నారు? ఎంత పాపిష్టిది సుందరన్నట్లు? మీరేమీ రాసి ఇవ్వనక్కర్లేదు. అలా అనండి చాలు. మా ఆయన సంగతి నాకు బాగా తెలుసు. ఏదీ ఆ కాగితం చూపించండని అడగరు. మీ మాటంటే అంత నమ్మకం ఆయనకి'' అని పకపకా సుందరి నవ్వితే మిగతా ముగ్గురూ ఆ నవ్వులో వంతు కలిపారు.

వర్ధనమ్మ 'విన్నారా? మీ ఆణిముత్యాల మాటలు? మీ ముద్దు మామ్మ తిట్టే తిట్లుకాక, నన్ను చూసుకుంటుందిట. ఏది ఏమైనా ప్రాణం పోయే వరకూ శ్రీరాంపురంలోని వుంటా అని వాళ్లకు తెలీదు పాపం. వాళ్లు నన్ను అడిగితే గదా? త్వరలోనే మీ దగ్గరకు తీసుకుపొండి' అని ఆయనకు చెప్పుకొని పక్కకు నిబ్బరంగా ఒరిగింది.

★



## అభి 'సారిక'కి ఏమయ్యింది??

కమల్ హాసన్‌తో విడిపోయాక సారికకి పిచ్చెక్క లేదు కదా? బాలీవుడ్ వర్గాల అనుమానం ఇది! ఈ అనుమానం ఆ వర్గాలకి ఎందుకు కలిగిందంటే ఈ మధ్య సారిక అలా ప్రవర్తిస్తోంది. ఇంతకీ విషయం ఏమిటంటే సారిక ఇటీవల ఓ ఉమన్ ఓరియంటెడ్ సినిమాను ఒప్పుకుంది. ఆమెకు ఆపోజిట్ కేరక్టర్‌లో ఆ సినిమాలో గుల్షన్ గ్రోవర్ యాక్ట్ చేస్తున్నారు. అయితే ఆ కేరక్టర్‌కి గుల్షన్ గ్రోవర్ వద్దంటూ వేరే వాళ్ళని చూడమంది సారిక. నిర్మాతలు 'సరే'నని, ఆ కేరెక్టర్‌కి పాప్యులర్ టివి స్టార్ అమన్ వర్మని బుక్ చేశారు. అయితే అమన్ వర్మను కూడా కాదంది సారిక. ' ఎవరయితే బాగుంటుందో మీరే చెప్పండి' అడిగారు నిర్మాతలు.' ఆ సంగతి తర్వాత ఆలోచిద్దాం. ముందు షూటింగ్ స్టార్ట్ చెయ్యండి'అంది. 'ఓకే ' అన్నారు నిర్మాతలు. షూటింగ్ స్టార్టయ్యింది. లండన్‌లో షూటింగ్. యూనిట్ అంతా ఆ హడావుడిలో ఉన్నారు. సారిక కూడా లండన్‌కొచ్చింది. వచ్చిన తర్వాత ఏమయిందో ఏమో! సారిక షూటింగ్‌లో పాల్గొన లేదు. ఒక్క ఫ్రేంలో కూడా యాక్ట్ చెయ్యకుండా ముంబాయికి తిరిగొచ్చేసింది. దీన్ని నిర్మాతలు తట్టుకోలేక పోయారు. 'మా అడ్వాన్స్ మాకిచ్చేయండి! మీరూ వద్దు! మీ నటనా వద్దు'అన్నారు నిర్మాతలు. 'సరే'నంది సారిక. డబ్బు నిర్మాతలకిచ్చిందా?లేదా? అన్నది తర్వాత సంగతి. అసలు సారికకి ఏమయిందన్నది ఎవరికీ అంతు పట్టడం లేదు.